తెలుగు కథానిక మ్యాజిక్—
రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో
బహుమతి పొందిన కథ.

# భారమైన బంధాలు

## జాస్తి రమాదేవి

ఇంటి ముందు ఆటో ఆగగానే చిన్నపిల్లలా క్రిందికి గెంతి గేటు తీసుకుని తనకు స్వాగతం చెబుతున్న పూలనూ, రెమ్మలనూ చేతుల్తో స్పర్శించి పులకించిపోయింది శారద.

"లోనికి రండి అత్తయ్యా!" కోడలు వీణ పిలవడంతో లోపలికి అడుగుపెట్టింది శారద. ఇల్లంతా కళ్లతో పరికించింది. ప్రతి వస్తువునూ తాకి కుశల మడిగింది.

"అయ్యయ్యో! ఏమిటి వీణా! తాత గారి ఫోటోకి దండ వాడిపోయింది. రోజా వేయడంలేదా! నువ్వు సరే పన్లో వుంటావు. ఆయనేం చేస్తున్నట్టు? ఏమండీ! ఏమండోయ్!"

"శారదా! అప్పుడే మొదలెట్టావా? రేపట్నించీ అన్నీ నీ ఇష్టంగా చేస్కుందుగాని లే ఇప్పటికి వదిలెయ్..."

చేతులు జోడించి అంటున్న భర్తతో చెమ్మగిల్లిన కళ్ళతో అంది శారద.

"నా ఫోటోకి వెయ్యమన్నానా చెప్పండి... మీ నాన్నగారి విషయంలో కూడా.."

"అత్తయ్యా! కాఫీ తీసుకుని కాస్సేపు రెస్ట్ తీసుకోండి.." వీణ అంది.

కోడలి మాట ప్రకారం విశ్రాంతి తీసుకోలేకపోయింది శారద. ప్రతి చిన్న విషయమూ గుర్తు చేసుకుని గుచ్చిగుచ్చి అడిగింది.

"వీణా! పనంతా నీ ఒక్కదానిపై పడి ఎంతగా చిక్కిపోయావ్ పాపం! నేనొచ్చాగా వంట పని నేచూసుకుంటాలే.."

కోడలి వైపు ప్రేమగా చూస్తూ అంది శారద.

"శారదా! టేబ్లెట్ వేసుకుని కాస్సేపు విశ్రాంతి తీసుకోవేయ్.." లాలనగా అన్నారు బలరామయ్య.

"ఏం విశ్రాంతండీ? ఈ పది నెలలూ విశ్రాంతి తీసుకుని కాళ్లూ చేతులూ చేవ చచ్చిపోయినట్లున్నాయి. ఇంక నావల్ల కాదు. ఇదిగో వీణా! మీ మావగారి మాటలు పట్టించుకోకు... సాయంత్రం వంట నేనే చేస్తాను."

"వంటపని ఏమంత కష్టం అత్తయ్యా! నేను చేసుకుంటాను.." గబగబా అంది వీణ.

"హాయ్! అమ్మా!" రవి రావటమే తల్లి పాదాలు తాకి ఆమె మెడ చుట్టూ చేతులు వేసాడు. శారద రవి నుదుట ముద్దు పెట్టుకుంది. రవి తన ప్రాణం. తన ఒక్కగానొక్క బిడ్డ. ఎంత ప్రేమగా పెంచుకుంది! కంటి పాపలా కాపాడుకుంది. వాడికి ఈ అమ్మంటే ఎంత ప్రేమని...! ఈ పది నెలలూ ఎలా వున్నాడో వెర్రినాన్న?

"వీణా! నా చేత్తో వాడికి కాఫీ కలిపి ఇస్తానమ్మా" అంటూ వంట గదిలో కెళ్ళి ఫ్రిజ్ ఓపెన్ చెయబోతున్న అత్తగార్ని కంగారుగా ఎదుర్కొంది వీణ.

"ఫ్రెండ్ బలవంతం చేస్తే బయట తాగి వచ్చానమ్మా!" అన్నాడు రవి.

పగలు మెల్లిగా సంధ్య ఒడిలోకి ఒదిగిపోతున్నా చంటిదాని జాడలేదు. శారద ఊరుకో లేక పోయింది.

"వీణా! చెందూ స్కూల్ నుంచి రాలేదూ?"

"అదీ... నిన్న మా చెల్లాయి వచ్చింది అత్తయ్యా! వాళ్ళాయన క్యాంపు కెళ్లారని పాపని తీసుకెళ్లింది."

చెప్పింది వీణ.

"రవీ! నాకు చెందూని చూడాలని వుందిరా!"

"పొద్దు పోయింది కదా! రేపు తీసుకొస్తా లత్తయ్యా!"

వీణ అనడంతో శారద మాట్లాడలేదు.

ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టలేదు శారదకి. ఏదో అర్థం కాని వెలితి అశాంతి కల్గిస్తోంది. నిన్నటి రాత్రి ఎన్ని ఊహలు? పది నెలల తర్వాత తన వాళ్ళ సమక్షంలోకి చేరుకుంటున్న ఆనందంతో నిద్ర పట్టలేదు. కానీ ఈ రాత్రి? ఈ రాత్రీ నిద్ర పట్టలేదు. అయితే ఆనందంతో కాదు.

"ఇదిగో విమ్మల్నే! అత్తయ్య పాపకోసం వందసార్లు అడిగారు. పెద్దవాళ్లం మనమైతే జాగ్రత్తగా వుంటాం. చిన్నపిల్ల దానికేం తెలుసు. దాన్ని గురించి ఆలోచిస్తే నాకు భయంగా వుంది. ఏదో సాకు చెప్పి కొన్నాళ్లు చెందూని అక్కడే వుంచుదాం. తర్వాత



4-6-93 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

